# ఈచూపు - రేపటివైపు!

'రేపు ఆఫీస్‌లో చెప్పు. ఇప్పుడేమీ తొందరలేదు' అంటూ చకచకా వెళ్ళిపోయింది శాంత.

నేను ఆలోచనల్లో మునిగిపోయాను.

❖ ❖ ❖

కాలేజీలో చేరిన కొత్తల్లో – ఒకరజు – నేను ఇంటికి వచ్చేసరికి నాన్నగారి మిత్రులెవరో వచ్చి కబుర్లాడుతున్నారు. అమ్మా, అమ్మమ్మా కూడా హాల్లోనే ఉన్నారు.

'అమ్మాయికి చక్కగా చిన్నతనంలోనే పెళ్ళి చేసేయాలనుకునే మీ ఆలోచన బాగుంది రావ్‌గారూ' ఆ మిత్రుల్లో ఎవరో అన్నారు. నేను విసవిసా నా గదిలోకి వెళ్ళిపోయాను.

ఆ రాత్రి, ముగ్గురూ కలిసి నా పెళ్ళి గురించి ప్రస్తావించారు. 'నా భావాలు నాకున్నై. మీరేమీ తొందరపడకండి' అని నిక్కచ్చిగా చెప్పాను. అమ్మమ్మ బుగ్గలు నొక్కుకుంది – ఇంతింత ఆశ్చర్యంతో, అమ్మేమో – దగ్గరగాజరిగి, నా కళ్ళల్లోకి చూస్తూ – 'ఊరికే నవ్వులాటకన్నావు కదూ?' అని పదే పదే, మాటలు మార్చి మార్చి అడిగింది. 'నేను నిజంగానే అన్నాను' అని జవాబిచ్చాను. తల్లీకూతుళ్ళు మొహామొహాలు చూసుకున్నారు. ఆ తర్వాత నాన్నవైపు చూశారు. ఆయన అప్పటికే పళ్ళు పటపటలాడిస్తూ అక్కణ్ణుంచీ కదిలారు.

వాళ్ళు ముగ్గురూ ఆ రాత్రి జాగారం చేశారు. ఆ ముగ్గురి మనసుల్నీ, స్వభావాల్నీ, విశ్లేషించుకుంటూ, నా మాటల్లోని ఆంతర్యాన్ని వింగడించుకుంటూ, నేనూ ఆ రాత్రి నిద్రపోలేదు. క్రమంగా ఆ కథ పాత బడింది.

నేను చదువుల సరస్వతినని పేరు తెచ్చుకుంటూ 'ర్యాంక్'లు కొట్టేస్తూ – ఎదిగిపోయానన్నారంతా! నవ్వుకున్నాను. సరస్వతికి 'పొగరు' అన్నారు కొందరు. కాబోలు అనుకున్నారింకొందరు.

'మన సరసట్టాగైనా మొండిఘటమేనే' అన్నది అమ్మమ్మ. 'అవున్లే, ఈ కాలంలో ఇట్లా వుండకపోతే మూలకు తోసేస్తారే అమ్మమ్మా' అనేదాన్ని. అమ్మఏదో చెప్పబోతుంటే, మాసిన పట్టు బట్టలా అయిపోతాం' అని పక్కకి వెళ్ళిపోయాను.

ఎమ్మెస్సీ అయింది.

ఒకరోజు నాన్న అడిగాడు. 'అసలు నీ మనసులో మాట చెప్పు సరస్వతీ' అని.

చెప్పాను. 'కట్నం అడగకూడదు. లాంఛనాల పేరుతో కట్నాన్ని మించిన లక్షలు గుంజకూడదు. సింపుల్ మేరేజీ. లేదంటే రిజిష్టర్డ్ మ్యారేజీ. పెళ్ళయిన తర్వాత కూడా ఉద్యోగం చేయనివ్వాలి. అంతే.'

నావైపు నిర్వేదంగా చూశాడు నాన్న. ఆ వెంటనే శూన్య దృక్కులతో బయటకి చూశాడు. బాల్కనీ బావురుమంటోంది. దశమి వెన్నెల తేజోవంతంగానే వుంది.

'సరే... కానీ, ప్రయత్నిద్దాం...' అంటూ తన గదిలోకి నడిచేడు.

ఏడాది గడిచింది. నేను ఒక కార్పొరేట్ కాలేజ్‌లో లెక్చరర్‌గా పనిచేస్తున్నాను.

ఈ ఏడాదిలో నలుగురు వరులు నన్ను 'పరీక్ష' చేసి వెళ్ళారు. అమ్మమ్మ చనిపోయింది.

నేను మళ్ళీ యూనివర్శిటీలో చేరాను. రిసెర్చ్ అయింది.

డాక్టరేట్ రావటం, కెమిస్ట్‌గా ఉద్యోగం రావడం ఒకేసారి జరిగాయి.

నేను ముంబై వచ్చేశాను.

నాన్న నా షరతుల్ని సడలించమన్నాడు. నేను ఒప్పుకోలేదు. ఆయన ప్రయత్నాలు ఆయన చేస్తూ ఉండేవాడు.

అప్పుడప్పుడూ - నాన్న ఫోన్‌కాల్స్ మీద విజయవాడ వచ్చేదాన్ని. అమ్మ ఏవేవో మాట్లాడేది. నా వయసు అడవిగాచిన వెన్నెల అయిపోతోందని బాధపడేది. 'మనిషిలో నేవళం పోతోందే సరస్వతీ' అని. 'ఏ వయస్సులో ముచ్చట ఆ వయస్సులో జరిగితేనే బాగుంటుందే' అనీ నిట్టూర్పులు విడిచేది.

మామూలు కార్యక్రమంజరిగేది. తలంటు పోసుకోవడం, కొంచెం నదురైన చీరె సింగారించటం.. వచ్చిన 'అభ్యర్థి' ముందు కూర్చోవడం, ప్రశ్నలూ, సమాధానాలూ, పరీక్ష...! మర్నాడు - తిరుగు ప్రయాణం!

ఈ ప్రయాణం ఇలా సాగుతుండగానే - చీఫ్ కెమిస్ట్‌గా ప్రమోషన్.

కాలం - మౌస్ కదలికల్లో పెరిగెత్తుతోంది...

ఫోన్ రింగయితే ఈ లోకంలో పడ్డాను. ఆలోచన తెగింది.

శాంత మాట్లాడుతోంది. 'సరూ... అర్జంటుగా రావాలి. ఇప్పుడే ఛాయని హాస్పటల్‌నుంచీ ఇంటికి తీసుకొచ్చాం. చాలా క్రిటికల్ కండిషన్ నుంచి బయటపడింది. నువ్‌రా... చెప్తాను...' అని స్విచ్ ఆఫ్ చేసింది. విషయమేమిటా అనే ఆందోళనతో హడావిడిగా కారు తీశాను.

శాంత నా కొలీగ్. మాయిద్దరి మధ్యా మంచి మైత్రి వుంది. ముంబై వచ్చినప్పటినుంచీ తల్లితోడులా వుంటున్నాం. ఆమె భర్త సుందరమూ చాలా కలుపుగోలు మనిషి. సిఏగా ఏదో ఫర్మ్‌లో చేస్తున్నాడు. ఛాయ వాళ్ళ ఏకైక పుత్రిక. బిటెక్ అయింది. ఉద్యోగ ప్రయత్నమూ, పెళ్ళి ప్రయత్నాలూ ఒకేసారి జరుగుతున్నై.

రెండు రోజులుగా శాంత సెలవులో వుంది. నాపని ఒత్తిడిలో నేనంతగా పట్టించుకోలేదు. ఒకసారి ఫోన్ చేస్తే 'ఎంగేజ్డ్'. మళ్ళీ చేయలేదు నేను.

ఏమై వుంటుందనే ఆలోచనలతోనే శాంతక్రూజ్ చేరాను. కారు పార్క్ చేసి లోపలికి నడిచాను.

ఆరిన కుంపటిలా వుంది యిల్లు.

శాంత కళ్ళు వాచిపోయివున్నై. చెదరిన జుట్టూ, చూపుల్లో ఎడారులూ- ఆమె బాధకు వ్యక్తీకరణనిస్తున్నై.

గదిలో ఓ పక్కగా సుందరం, విచారవదనంతో. అన్యమనస్కంగా ఆలోచనల సుడిలో వున్నాడు.

ఓ మూలగా మంచం మీద నిర్లిప్తంగా, సీలింగ్‌కేసి చూపులు నిగిడ్చి, పడుకుని వుంది ఛాయ. ఆమె కళ్ళల్లోనూ తడి. నేను ఛాయ మంచం పక్కగా కుర్చీలో కూర్చున్నాను.

శాంత మొదలెట్టింది. 'మంచి సంబంధం వచ్చింది -ఛాయకు పెళ్ళి చేసేద్దామనుకుంటున్నామని నీకు చెప్పాను కదా!'

అవునన్నట్టు తలవూపేను.

'ఈవిడగారు మనకంటే నాలుగాకులెక్కువ చదివి, నలభై గొంతెమ్మ కోర్కెలు కోరుతోంది. పిచ్చివేషాలెయ్యకని వాళ్ళ నాన్నా నేనూ వార్నింగిస్తే - ఇదిగో ఇట్టా నిద్రమాత్రలు మింగి యాగీ చేసింది. అడ్డమైన వాళ్ళనీ పట్టుకుని ఇంటికి తీసుకొచ్చేసరికీ మాప్రాణాలు పోయినంత పనైంది' శాంత గొంతులో, మాటలో కోపమూ, ఆందోళనా మిళితమైనాయి.

కొద్దిసేపు నిశ్శబ్దం తర్వాత 'మీలాంటివాళ్ళు ఈ పిల్లకి కాస్త కౌన్సిలింగ్ ఇవ్వాలి' అన్నాడు సుందరం.

నేను ఛాయవైపు చూస్తూ కూర్చున్నాను.

శాంత లేచి వంటింట్లోకి నడిచింది. నేనూ ఆమెను అనుసరించాను. కాఫీ తయారుచేస్తూ జరిగిన సంభావం తాలూకు వివరాలు చెప్పింది. కాఫీ కప్పులు తీసుకుని హాల్లోకి వచ్చాం. సుందరంకీ కాఫీ ఇచ్చింది శాంత.

'నువ్వు కాస్త బుద్ధి చెప్పి వెళ్ళాలి సరస్వతీ' అంటూ నా పక్కగా సోఫాలో కూర్చుంది శాంత. కాఫీ సిప్ చేస్తూ సన్నగా నవ్వేన్నేను.

ఆ తర్వాత చాలాసేపు మా సంభాషణ పెళ్ళిళ్ళ గురించే సాగింది. మాటల మధ్యలో ఇద్దరికీ కలిపి చెప్పాను. 'నాలుగు రోజులు గడవనీ, నేను మళ్ళీ వచ్చి ఛాయతో మాట్లాడుతును. ఈ నాలుగు రోజులూ ఆమెతో మీరీ విషయం గురించి ఏమీ మాట్లాడకండి. తనని రెస్ట్ తీసుకోనీయండి. కొంచెం కుదుట పడ్డాక చూద్దాం...' ఛాయ కళ్ళల్లోకి చూసి ఆదరంగా నవ్వేను.

కారుదాకా నాతో నడిచింది శాంత. 'దానికి ఇదివరకే నీ పెళ్ళి వ్యవహారమంతా చెప్పాను - అర్థం చేసుకుటుందేమోనని. అయినా బుద్ధి రాలేదు' కారు పక్కగా నిలబడి దిగులుగా అన్నది శాంత.

మౌనంగా నవ్వి కారెక్కాను. ఇంటికి చేరేసరికి పన్నెండయింది. పడుకున్నానన్నమాటేగాని, ఆలోచనలు తిరుగుబాటు చేశాయి. బుర్రంతా ఏకుల బుట్టలా వుంది. శాంత మాటలు మేధని గిరికీలు కొట్టిస్తున్నాయ్.

'నీ పెళ్ళి వ్యవహారమంతా చెప్పాను! అవును. నా పెళ్ళి వ్యవహారం! దాన్ని తలచుకుంటే తీతువుపిట్టలు అరుస్తున్నట్టుగా వుంటుంది మనసులో.

ఎమ్మెస్సీ అయిన తర్వాతే పదేళ్ళు సాగింది - నా పెళ్ళి వ్యవహారం. తలచుకుంటే, పాలల్లో ముంచి తీసిన బొగ్గులా కనిపిస్తుందంతా!

ఉన్నట్టుండి గదంతా చాలా ఇరుగ్గా వున్నట్లనిపించింది. చాలా చిరాకుగా అనిపించింది. లేచి వెళ్ళి ఫ్యాన్ వేసుకుని మంచం మీద పడుకున్నాను. వెలుగునీడల్లో - నా కథలోని పాత్రలన్నీ కళ్ళముందు కదలాడినై. పెళ్ళిచూపుల తతంగంలో నా దేహాన్ని స్పృశించిన చూపులూ, ఆ వెనక వినబడిన కూతలూ గుర్తుకొచ్చాయి.

రాజారావ్ -డాక్టర్ ! చక్రపాణి -ఇంజినీరు!

సత్యమూర్తి - గ్రూప్‌వన్ ఆఫీసర్ ! చంద్రమోహన్ - ప్రొఫెసర్! ఇంకా.. కృష్ణారావు, సుదర్శనం. ఓహ్... ఒకరికి అమ్మానాన్నల ఇల్లు తన పేరు మీద రాయాలి. ఒకరికి - ఉద్యోగం మానేయాలి! మరొకరికి - ఇంత తెలివిగల భార్య పనికిరాదు! ఇంకొకరికి - భార్యరూపవతీ శత్రుః

సరిసరి. తనకూ, అమ్మానాన్నలకీ కూడా ఈ షరతులకి విసుగొచ్చింది. వాళ్ళిద్దరి ఏడుపులూ, నిరాహార దీక్షలూ కూడా చివరికి నిష్ఫలమైనామయి.

అనుభవం నేర్పిన గుణపాఠం వలన, ముదికన్యగా మిగిలినదాన్ని ఆశయం కోసం వయసునీ,-కలల్నీ - కనురెప్పల మధ్యగా కదిలిపోనిచ్చిన దాన్ని!

ఇవాళ - ఛాయకి ఏం చెప్పగలను? ఏ ఆశయమూ వద్దనా? ఆడపిల్లకి వ్యక్తిత్వ స్పృహ వుండకూడదనా? లేకపోతే - తాను పెట్టిన నిబంధన ఆచరణ యోగ్యం కాదనా? ఏమని కౌన్సెలింగ్ ఇవ్వాలి?

రేపటివైపు చూపున్న ఛాయకి, నిన్నటితరం ప్రతినిధిగానే మిగిలిపొమ్మనీ, అమ్మానాన్న తెచ్చిన సంబంధం చేసుకోవడానికి తన షరతుని సడలించుకోమనీ చెప్పడం భావ్యమేనా!

ప్రశ్నల వెంట ప్రశ్నలు- నన్ను ఉక్కిరిబిక్కిరి చేయటం మొదలుపెట్టాయి. ఏమిటీ పరిస్థితి? ఎలా?

శాంతా సుందరం కూతురి కోసం తెచ్చిన వ్యక్తి పెద్ద కంట్రాక్టర్, వర్క్ దృష్ట్యా దేశమంతా తిరిగాల్సి వుంటుంది.

ఛాయ కోరిన కోర్కె – అతనికీ, తనకూ 'హెచ్ఐవి' టెస్ట్! ఆమె ఆ విధంగా అడగడం తప్పా? నేరమా? ఇప్పటి కాలమాన పరిస్థితుల దృష్ట్యా ఆ కోరిక కోరరానిదౌతుందా?

శాంత మాటలు నా చెవుల్లో గింగురుమంటున్నై.

ఈ కాలపు పిల్లలు నాలుగాకులు ఎక్కువే చదువుకున్నారు!'

అట్లాగైతే, ఆ చదువు – వ్యక్తికీ సంఘానికీ కూడా మంచిదే కదా? మీరేమంటారు? శాంతకేం చెప్పమంటారు?!

**–ఈవారం, జనవరి 01-07-2012**

కథా నిలయం
శ్రీకాకుళం